ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి హెచ్చరించారు. అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో శనివారం సుచిత్ర చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా రాంగ్ రూట్, లైసెన్స్ లేని 25 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారికి ఏసీపీ వెంకట్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్‌రూట్ ప్రయాణాలతో ట్రాఫిక్ జాం తలెత్తుతోందని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. భవిష్యత్‌లో మరోసారి ట్రాఫిక్ నిబంధలను ఉల్లఘిస్తూ పట్టుబడితే లైసెన్స్ రద్దు చేశామని హెచ్చరించారు. డ్రైవ్‌లో అల్వాల్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి 'టీవీఎస్ అపాచీ-160'


టీవీఎస్ అపాచీ-160 బైక్‌ను విడుదల చేసిన శ్రీసాయి శ్రీనివాసమోటార్స్ నిర్వాహకుడు సంజీవ్‌కుమార్

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శ్రీసాయి శ్రీనివాస మోటార్స్‌లో టీవీఎస్ అపాచీ-160 బైక్‌ను శనివారం మార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు, డీలర్ సంజీవ్‌కుమార్, కంపెనీ సేల్స్ మేనేజర్ ప్రవీణ్ చౌదరి మాట్లాడుతూ మూడు రైడ్‌మోడ్‌లలో టీవీఎస్ అపాజీ-160 బైక్ వినియోగదారుల అభిరుచులకు తగ్గట్లుగా తెలుగు రాష్ట్రాల్లోని మార్కెట్‌లోకి విడుదల చేశామన్నారు. ఆర్‌టీఆర్ 160 2వీ, ఆర్‌జీఆర్ 160-4వీ మోడళ్లలో ఎల్‌సీడీ క్లస్టర్, ఎల్ఈడీ హెడ్‌లైట్, 160 సీసీ ఆయిల్ కూల్డ్ ఇంజిన్‌ను వీటి ప్రత్యేకతలని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 55 లక్షల అపాచీ వాహనాలను విక్రయించామని తెలిపారు.

ఇంజినీరింగ్ కాలేజీలో సంగీత విభావరి

నిజాంపేట్: గోకరాజు లైలావతి మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం శాస్త్రీయ నృత్య, సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అన్నమాచార్య, రామదాసు, త్యాగరాజ కీర్తనలు, భరత నాట్యం , కూచిపూడి,పేర్ని వంటి నృత్యాలతో అలరించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి హనుమాన్ శాస్త్రీయ నృత్య, సంగీతం విశిష్టతను విద్యార్థినులకు వివరించారు. అదేవిధంగా కళలు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నిధుల గోల్‌మాల్‌పై పోలీసులకు ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న కౌసల్య కాలనీవాసులు

నిజాంపేట్: కౌసల్య కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, కోశాధికారి రంజిత్‌పై స్థానికులు శనివారం బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా పదవిలో ఉన్న వీరు సరైన లెక్కలు చూపించకుండా సుమారు రూ.8 లక్షలను సొంత అవసరాలకు వాడుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నిస్తే వాట్సాప్ గ్రూప్‌ల్లో అవమానించేలా పోస్టులు పెడుతున్నారని తెలిపారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్‌ను కోరారు. చేసిన వారిలో రమణి, సత్యనారాయణ, గంగారెడ్డి, బాలగంగాధర్, గొల్లకృష్ణ, సంతోష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

తల్లి చెంతకు బాలుడు

జీడిమెట్ల: తప్పిపోయిన బాలుడిని జీడిమెట్ల పోలీసులు గుర్తించి తల్లికి అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సాకు చెందిన బసంతి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అపురూపా కాలనీలో ఉంటుంది. ఆమెకు కుమారుడు ఆయూష్(7) ఉన్నాడు. బసంతి డ్యూటీకి వెళ్లగా ఆయూష్ స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం అయూష్ ఇంటి వద్ద ఆడుకుంటూ బయటకు వెళ్లి తప్పిపోయాడు. డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన తల్లికి కుమారుడు కనిపించకపోవడంతో చుట్టు పక్కలా గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలుడి తల్లి శనివారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం 11 గంటలకు సూరారంలో బాలుడి జాడ కనుక్కొని తల్లి బసంతికి బాలుడిని అప్పగించారు.



తప్పిపోయిన బాలుడితో ఇన్‌స్పెక్టర్

అధ్వానంగా మట్టి రోడ్డు



నందనవనం కాలనీకి వెళ్లే రోడ్డు




గుంతలమయమైన రహదారి

రోడ్ల పనులకు మోక్షమెప్పుడో..?

- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అధ్వానంగా మట్టి రోడ్లు
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మట్టి రోడ్లతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీల నుంచి కార్పొరేషన్‌గా మారిన తర్వాత కూడా ఇప్పటికీ పలు కాలనీలు, బస్తీల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. మరోవైపు నూతన రోడ్లు వేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించాలంటేనే జంకుతున్నారు. ఈ రోడ్లకు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంతల రోడ్లతో అవస్థలు..

మట్టి రోడ్లతో పాటు, ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రజలు, వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. గుంతల్లో పలువురు పడి ప్రమాదాల బారిన పడుతున్నాప్పటికీ పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు.

తవ్విన రోడ్లకు మరమ్మతులేవి..?

కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనుల కోసం తవ్విన రోడ్లకు సకాలంలో మరమ్మతులు చేపట్టడంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి గుంతలు పూడ్చకుండా ఉంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. మంజీరా నీటి పైపులైన్లు, డ్రైనేజీ లైన్ల కోసం, డ్రైనేజీ మరమ్మతుల కోసం ఇలా వివిధ అవసరాల కోసం తవ్విన రోడ్లకు మరమ్మతులు చేయడం లేదు. ప్రభుత్వం వర్షాకాలానికి ముందే రోడ్ల మరమ్మతులు, ఇతర తవ్వకాలు ఉంటే పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్ర స్థాయిలో అధికారులు మాత్రం వాటిని అమలు చేయడం లేదు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి వెంటనే నూతన రోడ్లతో పాటు, మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


సాయినగర్‌లో డ్రైనేజీ పైపు లైన్ కోసం తవ్విన రోడ్డు


ఆదిత్య గార్డెన్స్ నుంచి నిజాంపేట్ వెళ్లే రోడ్డు దుస్థితి


బాచుపల్లి ప్రాంతంలో మట్టి రోడ్డు

అనారోగ్యంతో వ్యక్తి మృతి

జీడిమెట్ల: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ (52) చిన్న చిన్న పనులు చేసుకుంటూ హెచ్‌ఏఎల్ కాలనీలోని ఓ పురాతన ఇంట్లో ఉంటున్నాడు. వచ్చిన డబ్బులతో మద్యం తాగుతుండేవాడు. శనివారం ఉదయం శ్రీనివాస్ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వెళ్లి గది తలుపులు తీయగా శ్రీనివాస్ మృతదేహం కుళ్లిన స్థితిలో పడి ఉన్నది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇంటి నుంచి బయటకు రావడం లేదని చుట్టుపక్కల వారు పోలీసులకు వివరించారు. మృతుడి సోదరి సత్యప్రియ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు

సుభాష్‌నగర్: బోనాల పండుగ సందర్భంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ అన్నారు. సిబ్బందితో కలిసి శనివారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ప్రధాన ఆలయాలు చిత్తరమ్మ, కట్ట మైసమ్మ తదితర ఆలయాల వద్ద ఉన్న ప్రధాన రహదారులను పరిశీలించారు. ఫలహారం బండి ఊరేగింపులో ట్రాఫిక్ జాం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్‌కు చెందిన యునైటెడ్ చర్చి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సంస్థ చైర్మన్ కల్లోజి రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం హన్మంతరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించిన హన్మంతరెడ్డి వారికి తన సహాయ సహకారాలు ఉంటాయని హామీనిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పాస్టర్స్ చైర్మన్ బిషప్ గోడి శేఖర్, చీఫ్ ప్యాట్రన్ ఈట ప్రదీప్ శ్యామ్, నూతన కమిటీ అధ్యక్షుడు పాస్టర్ జెఫన్యా, జనరల్ సెక్రెటరీ పాస్టర్ దయానిధి, ట్రెజరర్ పాస్టర్ విజయ్‌కుమార్, పాస్టర్ మురళీ నాయక్, పాస్టర్ పరిశుద్ధరావు, రవికాంత్, జెర్మియా, విజయ్‌కుమార్, టేకుమూడి తదితరులు ఉన్నారు.

ప్రణీత్ అంటిలియా గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు..

రోడ్డు సమస్యను పరిష్కరించాలని పలువురు హన్మంతరెడ్డి దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఆయన హామీనిచ్చారు. నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

రిమాండ్‌కు తరలింపు

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ గాగిల్లాపూర్ కౌన్సిలర్ భర్తను దుండిగల్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కౌన్సిలర్ కుంటి అరుణ భర్త నాగరాజును గతంలో ఉన్న కేసు విచారణ విషయమై హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే నాగరాజు అటెండ్ కాకపోవడంతో అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. దీంతో కోర్టు ఆదేశాలతో శనివారం దుండిగల్ పోలీసులు నాగరాజును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

విధులు పకడ్బందీగా నిర్వర్తించాలి


హాజరైన ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బంది

కుత్బుల్లాపూర్: విధులు మరింత పకడ్బందీగా నిర్వర్తించాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని డీసీపీ కార్యాలయంలో మేడ్చల్ డివిజన్ పరిధి పోలీస్ సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో పెట్రోలింగ్ మరింతగా పెంచాలని, ఫిర్యాదులు అందిన సిబ్బంది వెంటనే స్పందించేలా సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా డయల్ 100 సర్వీసును మరింత మెరుగుపర్చుకోవాలని, సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. బోనాలు పండుగ నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

ప్రమాణ స్వీకారం

నిజాంపేట్: డిస్ట్రిక్ట్ 320ఏ గవర్నర్ లయన్ కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం నగరంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ నూతన ప్రెసిడెంట్ పాట్రిసియో ఒలివేరా, ఆయన సతీమణి అమరిల్స్ ఒలివేరాను సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఫౌండర్ సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో వారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు, సునీల్, పాస్ట్ మల్టీపుల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్స్ ప్రేమ కుమార్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ సెకండ్ గవర్నర్ మహేంద్రకుమార్, ప్రగతి క్లబ్ ప్రెసిడెంట్ శేషయ్య, సుబ్బారెడ్డి, రామ్‌తిలక్, తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు శంభీపూర్‌లోని కార్యాలయంలో శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యాసంస్థల్లో బోనాల వేడుకలు


సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో..

నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో శనివారం బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. పోతరాజుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. పాఠశాలల్లో అమ్మవారిని నెలకొల్పి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. విద్యార్థులకు బోనాల విశిష్టతను తెలియజేసేందుకే వేడుకలు నిర్వహించినట్లు పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి.

– కుత్బుల్లాపూర్


బోనంతో బాలిక

కుక్కల బెడద నివారణకు చర్యలు

దుండిగల్: కుక్కల బెడదను నివారించేందుకు బ్లూక్రాస్ సొసైటీతో కలిసి పని చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయరావు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని మల్లంపేట్, శంభీపూర్ ప్రాంతాల్లో సిబ్బంది, బ్లూక్రాస్ సొసైటీ సంస్థలు సంయుక్తంగా 16 వీధి కుక్కలను శనివారం తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధి కుక్కలకు పిల్లలు పుట్టకుండా స్టిరలైజేషన్ ఆపరేషన్ చేయించడంతో పాటు యాంటీ రేబీస్ టీకా వేయిస్తామన్నారు. ఆహారం, తాగునీరు అందని సమయాల్లో వీధి కుక్కలు విచిత్రంగా ప్రవర్తిస్తాయని, వాటికి ఆహారం అందించేలా స్థానికులు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా వీధి కుక్కల బెడద ఉంటే తమను సంప్రదిస్తే పరిష్కరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.



కుత్బుల్లాపూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌ను ఆదర్శంగా తీసుకుని జీహెచ్ంఎసీ పరిధిలోని అన్ని సర్కిళ్ల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. ఇటీవల కుత్బుల్లాపూర్ సర్కిల్‌ను ఆమె సందర్శించి రోడ్లపై పేరుకుపోయిన చెత్త వ్యర్థాల ఫొటోలు చిత్రీకరించారు. వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఎస్‌డబ్ల్యూం డిప్యూటీ కమిషనర్ మోహన్ రెడ్డి, సహాయ మెడికల్ అధికారి భార్గవ్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్తను తరలించేలా చర్యలు తీసుకున్నారు. కమిషనర్ మరోసారి సర్కిల్ పరిధిలో తాను గతంలో పర్యటించిన ప్రాంతాలను సందర్శించి తాజాగా ఫొటోలు చిత్రీకరించారు. సర్కిల్ అధికారులు చెత్తను తరలించేందుకు చూపిన చొరవను ప్రశంసిస్తూ జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో పోస్టింగ్ పెట్టారు. ప్రతి సర్కిల్ పరిధిలో స్వచ్ఛ ఆటోల పనితీరు మెరుగుపర్చాలని, క్యూ ఆర్ కోడ్‌తో స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం చేయడం, స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇళ్ల వ్యర్థాలను అందించని కుటుంబాలను గుర్తించి వారికి అవగాహన కల్పించేలా స్వయం సహాయక సంఘాలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు కృషి చేయాలని సూచించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ జీవీపీ లేని సర్కిల్‌గా జీహెచ్ఎంసీలోనే ఆదర్శంగా నిలిచిందని, అందుకు డిప్యూటీ కమిషనర్ (ఎస్‌డబ్ల్యూఎం) మోహన్ రెడ్డి, సహాయ మెడికల్ అధికారి భార్గవ్ ప్రత్యేక చొరవ ఎంతో ఉందని ఆమె ప్రశంసించారు.


కమిషనర్ ఆమ్రపాలి తీసిన చిత్రం


ప్రస్తుతం తీసిన చిత్రం